జిల్లాలో డిగ్రీ కళాశాలల బంద్ విజయవంతం

జగిత్యాల, అక్టోబర్ 14 : డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో, జిల్లా కేంద్రంతో పాటు, అన్ని పట్టణాల్లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు బంద్ పాటించాయని డిగ్రీ కళాశాలల జిల్లా అధ్యక్షుడు పోతని ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 15 కోట్ల వరకు బకాయిలు రావాలని, దీంతో కళాశాలల సిబ్బంది జీతాల చెల్లింపు, భవనాల అద్దెలు, వడ్డీల చెల్లింపు, నిర్వహణ కూడా కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే వరకు కళాశాలలు తెరవబోమని డిగ్రీ కళాశాలల జిల్లా అధ్యక్షులు, జిల్లా డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు బంద్ పాటించాయి.

ఉడిపి హోటల్ సీజ్

సీజ్ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

జగిత్యాల, అక్టోబర్ 14: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గణేశ్ భవన్ ఉడిపి హోటల్‌ను సీజ్ చేశారు. హోటల్‌లో ఆదివారం ఇడ్లిలో జెర్రి రాగా, మహిళా కస్టమర్ అధికారులకు ఫిర్యాదు చేసింది. సోమవారం ఫుడ్ సేఫ్టీ ఇన్ స్పెక్టర్ అనూష హోటల్‌ను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు నిర్వహణ లేకపోవడంతో హోటల్‌ను సీజ్‌చేశారు. హోటల్‌లో పారిశుధ్యం సరిగా లేదని.. సరుకుల నిర్వహణ బాగాలేదని, ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు కేసు నమోదు చేశామని అనూష తెలిపారు. ఉదయం ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్‌ను సీజ్ చేయగా, సాయంత్రం హోటల్‌కు సంబంధించి చిన్న షెటర్‌ను తీసి ప్రజలకు టిఫిన్ అందించినట్లు తెలిసింది.

భార్యను కాపురానికి పంపించడం లేదని..

- అత్తగారింటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన అల్లుడు
- మద్యం మత్తులో వీరంగం

కోరుట్ల రూరల్, అక్టోబర్ 14: తన భార్యను కాపురానికి పంపించడం లేదని అర్ధరాత్రి మద్యం మత్తులో అత్తాగారింటికి వెళ్లి వారి అల్లుడు నానాహంగామా సృష్టించాడు. వివరాల్లోకి వెళ్తే.. కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన మహిళతో కొన్నేండ్ల క్రితం వివాహమైంది. అయితే తన భార్యను కాపురానికి పంపించడం లేదని అర్ధరాత్రి మద్యం మత్తులో అత్తగారి ఇల్లు అయిన మోహన్‌రావుపేటకు భర్త తాగి వచ్చాడు. ఇంటి ముఖద్వారం తలుపులు బాదాడు. వారు ఎంతకీ తలుపులు తీయకపోవడంతో ఆగ్రహానికి గురయ్యాడు. వెంటనే ద్విచక్రవాహనంతోపాటు ఇంటి ముఖద్వారంపై పెట్రోల్ పోసి నిప్పంటింటాడు. ఇంటి ముఖద్వారం పాక్షికంగా కాలిపోగా, ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందజేదని పోలీసులు తెలిపారు.

విరిగిన ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ తూం షట్టర్

- నిలిచిన సాగునీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కాల్వలో విరిగి పడ్డ తూం షట్టర్

పెగడపల్లి, అక్టోబర్ 14: ఐతుపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ తూము షట్టర్ (ఓటీ స్లూయిస్) విరిగి కాలువలో పడిపోయింది. దీంతో తూము నుంచి నీటి సరఫరా లేక పోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు చెందిన డీ-75 తూము షట్టర్ గేర్ రాడుతో సహా, విరిగి ప్రధాన కాలువలోనే పడిపోయింది. షట్టర్ కింది భాగం తూములోనే ఇరుక్కుపోవడంతో డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీళ్లు రాకపోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీటి కోసం ఇబ్బందిపడుతున్నారు. విరిగిన తూము షట్టర్‌కు అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం

కోరుట్ల, అక్టోబర్ 14 : పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో సోమవారం గ్రాడ్యుయేట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ అసోసియోషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుల రవీందర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చెన్న విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా సమీర్, సహాయ కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ముసావీర్, కార్యవర్గ సభ్యులుగా మనీషా, రమేశ్, గోపిలను ఎన్నుకున్నట్లు అసోసియోషన్ సభ్యులు తెలిపారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పెగడపల్లి, అక్టోబర్ 14 : మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి గ్రామం వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొట్టడంతో రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన దంపతులు అలువాల విష్ణు, రమ్యకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. పెగడపల్లి మండల కేంద్రంలో లేడీస్ ఎంపోరియం షాప్ నడిపిస్తున్న విష్ణు, రమ్య పండుగకు గోపాల్‌రావుపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా, మ్యాకవెంకయ్యపల్లి వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బైక్ వారిని ఢీ కొట్టిందని, స్థానికులు చికిత్స కోసం కరీంనగర్ తరలించగా, విష్ణుకు కాలు, చేయి విరుగగా, రమ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. రమ్యకు తలకు తీవ్రంగా గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విష్ణు తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణపై సమావేశం

పెగడపల్లి, అక్టోబర్ 14: నామాపూర్ గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వరి ధాన్యం కొనుగోలు నిర్వహణపై సోమవారం మండల సెర్ప్ ఏపీఎం సమత సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రం నిర్వహణను మహిళా సంఘ సభ్యులు చూసుకోవాలన్నారు. దీనికి వీవోఏలు బాధ్యత తీసుకోవాలన్నారు.

ధ్వజ స్తంభం నిర్మాణానికి విరాళం

గొల్లపల్లి, అక్టోబర్ 14: మండల కేంద్రంలోని రామచంద్ర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం నిర్మాణానికి నవ దుర్గా సేవా సమితి యూత్ సభ్యులు రూ. 50,016 విరాళం సేకరించారు. కాగా, సోమవారం ఆలయ ధర్మకర్త అనంతుల భూమయ్య, అర్చకుడు తిరుణహరి తస్యనారాయణాచార్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రగాళ్లు తస్మాత్ జాగ్రత్త .. వెలిసిన గోడ ప్రతి

మేడిపల్లి, అక్టోబర్ 14 : మండలంలోని కట్లకుంట గ్రామంలో 'గ్రామ మంత్రగాళ్లు తస్మాత్ జాగ్రత్త' అని సోమవారం గోడ ప్రతి వెలిసింది. వివరాలు.. ప్రజల మంచి కోరే సంస్థకు అందిన సమాచారం మేరకు.. మంత్రగాళ్లను ఒక్కొక్కరిని చంపబోతున్నాం. గచ్చు నూతి దగ్గర ఉన్న ఇద్దరి మంత్రగాళ్లతో మొదలు పెడతాం. ఆ తర్వాత గుండ్ల వాడకట్టు, గొల్లోల్ల వాడకట్టు, గౌండ్లోల్లు, పాల కేంద్రం చుట్టుపక్కల మాల, మాదిగల వాడకట్టులో ఉన్న మంత్రాగాళ్లందరిని చంపుతాం. ఎవరూ ఎప్పుడు ఎలా చస్తారో మాకే తెలియదు. గ్రామ ప్రజలకు మనవి ఇప్పటి వరకు మీరు చూస్తూ ఎలా వున్నారో అలాగే ఉండండి. అలా కాకుండా మంత్రగాళ్లకు సపోర్టు చేశారో మీకు కూడా ప్రాణ పాయం ఉండొచ్చు. అనేక మంది అనేక బాధలు పడుతూనే వున్నారు. ఈ మంత్రగాళ్ల వల్ల.. ఇట్లు ప్రజల మంచి కోరే సంస్థ అని గోడ ప్రతిలో రాశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
కావలెను
jobs Apply Now!
★ మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావాలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర|| సెల్: 8341220970
NTK-335282
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

కోరుట్ల రూరల్ : ఎకీన్‌పూర్‌లో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

మారుతీనగర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూల పండుగ

- ఆనందోత్సాహాలతో వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా ఆడిపాడిన మహిళలు

సారంగాపూర్ : కోనాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జగిత్యాల రూరల్ : బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న దావ వసంత

జగిత్యాల రూరల్: జాబితాపూర్‌లో

రాయికల్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఇబ్రహీంపట్నంలో ..

జిల్లాలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు సంబురంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన సద్దుల బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో పెట్టి ఆడిపాడారు. యువతులు కోలాటాల మధ్య దాండియా ఆడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను గ్రామ శివారులోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. చెరువు గట్ల వద్ద మహిళల వాయినాలను ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకుంటూ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సారంగాపూర్ మండలకేంద్రంలో మాజీ ఎంపీపీ కోల జమున, మాజీ వైస్ ఎంపీపీలు సొల్లు సురేందర్, బల్మూరి లక్ష్మణ్ రావు, సింగిల్ విండో చైర్మన్లు గురునాథం మల్లారెడ్డి, లేటి నర్సింహ రెడ్డి, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతి నిధులు ఆకుల జమున, బొడ్డుపెల్లి రాజన్న, పల్లికొండ రమేశ్, మ్యాలెపు విమల, దమ్మ గంగు, రమణరావు, శ్రీలత, చుంచు శారద పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో మాజీ ఎంపీపీ భీమేశ్వరీ, మాజీ జడ్పీటీసీ భారతి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లత, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మారుతీనగర్‌లో మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సారంగాపూర్/జగిత్యాల రూరల్/కథలాపూర్/మేడిపల్లి/రాయికల్/మెట్‌పల్లి రూరల్/కోరుట్ల రూరల్/మారుతీనగర్

బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

మేడిపల్లి : దమ్మన్నపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మారుతీనగర్ : హనుమానగర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సంబురాలు

ఆలయానికి విరాళం

కొడిమ్యాల, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో పునర్ నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి రూ. లక్ష విరాళం అందజేశారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం పక్కన నిర్మిస్తున్న పోశమ్మ ఆలయానికి విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఏలేటి నర్సింహరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాచకొండ చంద్రమోహన్, మల్లేశం, జలెందర్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రవీందరెడ్డి, తదితరులున్నారు.

మోహన్‌రావుపేటలో గంజాయి కలకలం

కోరుట్ల రూరల్, అక్టోబర్ 14 : మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో ఆదివారం రాత్రి కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారనే కలకలం రేకెత్తింది. గ్రామశివారులోని చిన్నమెట్‌పల్లి రోడ్డులో కొందరు యువకులు మద్యంతో పాటు గంజాయి సేవిస్తున్నారని, పలువురు గ్రామస్తులకు సమాచారం రావడంతో గ్రామస్తులు గ్రామశివారులో ఉన్న యువకుల వద్దకు వెళ్లగా కొందరు యువకులు పారిపోగా దొరికిన యువకులను చితకబాదారు. కాగా, గ్రామానికి చెందిన కొందరు తమ పిల్లలను మద్యం మత్తులో వచ్చి చితబాదారని యువకుల తల్లిదండ్రులు ఆరోపిస్తూ పంచాయతీ వద్ద సోమవారం గుమ్మిగూడడంతో విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకోగా, అక్కడి నుంచి వారు వెళ్లి పోయారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విఫ్ ఆదిశ్రీనివాస్‌కు వినతి

కథలాపూర్, అక్టోబర్ 14 : వేములవాడలో రాష్ట్ర ప్రభుత్వ విఫ్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌ను సోమవారం కథలాపూర్ మండలం దుంపేట గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులో ఉన్న వరద కాలువ భూమి కేసీఆర్ ప్రభుత్వం రైతులకు వరి, మక్కజొన్న ధాన్యం ఆరబెట్టుకోవడానికి కేటాయించారని తెలిపారు. రైతులకు కేటాయించబడిన వరద కాల్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసుకున్నారని వివరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- ప్రజావాణికి 22 ఫిర్యాదులు
- అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 14 : ప్రజావాణికి వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పీ రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారీగా, శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు, మధుసూదన్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్ అందించండి

పెరంబదూరు విజయ, జగిత్యాల

జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు పెరంబదూర్ విజయ భర్త రవి నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి వితంతువు పింఛన్ అందించాలని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా.. కానీ, ఇప్పటి వరకు పింఛన్ అందించలేదు.

పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు

మేడిపల్లి, అక్టోబర్ 14 : పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ప్రత్యేక అధికారి ఆనంద్ అన్నారు. మండలంలోని వల్లంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అబ్దుల్ కలాం జ్ఞాన వేదిక (గ్రంథాలయం)ను 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన సంపతి రాజు, గౌరి అనుప్రియ, దొడ్డి రవీనా, సందెల గణేశ్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. వల్లంపల్లి గ్రామానికి చెందిన వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిని, దాతలను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో 'మన ఊరు వెల్ఫేర్ అసోషియేషన్' ఆధ్వర్యంలో నిర్మించిన ఈ లైబ్రరీలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యువతి, యువకులు సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మన ఊరు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెల్మ నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెల్మ సమత, మాజీ ఎంపీటీసీ నాయిని మమత, రవిగౌడ్ దంపతులు, పంచాయతీ కార్యదర్శి ప్రవీన్‌కుమార్, సింగిల్‌విండో సీఈవో తొర్తి గోపి, కారోబార్ గోపి, మాజీ వార్డు సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి మార్కెట్ కమిటీ సభ్యులకు అభినందనలు

సారంగాపూర్, అక్టోబర్ 14 : ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలంలోని రంగపేటకు చెందిన రామడుగు రవి, బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం గ్రామానికి చెందిన ఏనుగు జోగిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు వారిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు చెందిన రామడుగు రవి, ఏనుగు జోగిరెడ్డికి ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా అవకాశం ఇవ్వడంపై ఆయా మండలాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విఫ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నాయకులకు రవి, జోగిరెడ్డి ధన్యావాదాలు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

కోరుట్ల, అక్టోబర్ 14: నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన అహ్మద్ అప్సర్‌షేక్(23) కొద్దిరోజులుగా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కోరుట్లలోని తన నానమ్మ ఇంటికి వచ్చాడు. తన ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో కల్లూరు రోడ్డు బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తండ్రి షేక్ ముక్తార్‌షేక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నంచర్లలో మరొకరు..

పెగడపల్లి, అక్టోబర్ 14: నంచర్ల గ్రామానికి చెందిన బండి తిరుపతి(42) కొంత కాలంగా యూరిక్ ఆసిడ్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో సోమవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

శబరిమలకు మహా పాదయాత్ర

ఇరిముడితో 20 మంది అయ్యప్పదీక్షాపరులు

పాదయాత్రకు వెళ్తున్న స్వాములకు కండువాను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీమణి సరోజన

మారుతీనగర్, అక్టోబర్ 14 : మెట్‌పల్లి పట్టణం నుంచి శబరిమలకు 20 మంది అయ్యప్పదీక్షాపరులు మహాపాదయాత్రను సోమవారం ప్రారంభించారు. అయ్యప్ప ఆలయంలో రాజేందర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 20 మంది దీక్షాపరులు సిరిసిల్లాకు చెందిన విద్యాసాగర్ గురుస్వామి చేతుల మీదుగా ఇరిముడి కట్టుకొని మహాపాదయాత్రను ప్రారంభించారు. గురుస్వామి రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ సిరిసిల్లా జిల్లా మీదుగా మహాపాదయాత్రగా వెళ్తున్నామని తెలిపారు. కాగా, అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన అయ్యప్ప దీక్షాపరులకు దారి ఖర్చుల కోసం రూ.10 వేలు అందజేశారు. మణికంఠున్ని దర్శించుకొని క్షేమంగా తిరిగిరావాలని ఆకాక్షించారు.

రాయికల్ అక్టోబర్ 14 : మండలానికి చెందిన ముగ్గురు అయ్యప్ప దీక్షాపరులు సోమవారం శబరిమలకు పాదయాత్రను ప్రారంభించారు. ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన యాచమనేని దీపక్, భూపతిపూర్ గ్రామానికి చెందిన ముక్కెర నరేందర్, రామాజీపేట గ్రామానికి చెందిన మామిడిపెల్లి లక్ష్మణ్ రాయికల్ పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం లో దీక్షను స్వీకరించారు.

అనంతరం వారి ఇంటి నుంచి శబరిమల పాదయాత్రకు బయలుదేరారు. రాయికల్ మండలం నుంచి పాదయాత్ర ప్రారంభించిన భక్తులు, తమ ఆధ్యాత్మిక విశ్వాసం, భక్తి కోసం ఈ యాత్రను అంకితభావంతో చేస్తున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుపై సమీక్ష

జగిత్యాల, అక్టోబర్ 14: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నేషనల్ లెవెల్ మానిటరింగ్ సభ్యులు జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సోమవారం వారితో కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఎల్ఎం సభ్యులు సుబ్రహ్మణ్యంరెడ్డి, జయప్రకాశ్‌తోపాటు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

జగిత్యాల రూరల్, అక్టోబర్ 14: అంతర్జాతీయ బాలికల దినోత్సవ వీక్‌లాగ్ సెలబ్రేషన్‌లో భాగంగా సోమవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల సీడీపీవో మమత మాట్లాడుతూ, బాలికలకు సమాజంలో సాధికారత సాధించడానికి ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తున్నదని తెలిపారు. బాలికలు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కేంద్ర బృందం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అశ్విని, కరుణశ్రీ, జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, గౌతమి, నరేశ్, సుందరమ్మ, బాలసదన్ వార్డెన్, సిబ్బంది ఉన్నారు.

దాడి కేసులో ఇద్దరిపై కేసు నమోదు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 14 : జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన అరె తిరుపతిపై అదే గ్రామానికి చెందిన మర్రెపల్లి సాయినాథ్, మర్రిపెల్లి చందులు తిరుపతి ఇంటికి వచ్చి అనవసరంగా బూతులు తిడుతూ, దాడి చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సదాకర్ తెలిపారు. బాధితుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్..

జగిత్యాల టౌన్, అక్టోబర్ 14 : డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులందరికీ మంగళవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో పాఠశాల ఎంపిక చేసుకోవడానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్‌పండిట్స్, పీఈటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు, ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు మధ్యాహ్నం 1 గంటకు తమ నియామక పత్రం(ఓరిజినల్)తో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

వీధి కుక్కల పట్టివేత

కోరుట్ల, అక్టోబర్ 14: పట్టణంలో సోమవారం మున్సిపల్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాలతో వీధి కుక్కలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానికంగా వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో 15 కుక్కలను పట్టుకుని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కథలాపూర్, అక్టోబర్ 14 : కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామ శివారులోగల వాగులో నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అరికట్టలానిమహాలక్ష్మి గుడేటి కాపు సంఘ సభ్యులు తహసీల్దార్ వినోద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వాగు నుంచి ఇసుకను తీయడంతో పక్కన గల గుడేటి సంఘ భవనం కూలిపోయే ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మహిపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు